క్లుప్తంగా

జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థిని విష్ణుప్రియను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సుందరయ్య నగర్ శ్రీ గణేష్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని విష్ణుప్రియ జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం లక్ష్మీనారాయణరెడ్డి, పీఈటీ వీర తెలిపారు. గురువారం విద్యార్థిని విష్ణుప్రియను హెచ్‌ఎం, పీఈటీలు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో అక్టోబర్ 30న జరిగిన ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విష్ణుప్రియ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈనెల 3, 4, 5 తేదీల్లో కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జరిగే అండర్-17 ఫుట్‌బాల్ జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఈ పోటీల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు.

వారం రోజుల్లో విస్తరణ పనులు

అమడగూరు: అమడగూరు బస్టాండు నుంచి గ్రామ నడిబొడ్డున ఉన్న పీర్ల చావిడి వరకూ రోడ్డు విస్తరణకు ప్రజలు సహకరించాలని అధికారులు కోరారు. గురువారం తహసీల్దార్ వెంకటరెడ్డి, ఎస్‌ఐ బలరామయ్య, ఈఓఆర్డీ నసీమా రోడ్డు విస్తరణకు స్థలాన్ని పరిశీలించారు. ఇప్పటికే రోడ్డుకు ఇరువైపులా ఉన్న వారికి నోటీసులను ఇచ్చామన్నారు. రోడ్డు విస్తరణతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అలాగే చౌడేశ్వరీ, వినాయక విగ్రహాల ఊరేగింపునకు అనువుగా ఉంటుందన్నారు. వారం రోజుల్లో విస్తరణ పనులను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

'దిశ' యాప్‌తో రక్షణ



మాట్లాడుతున్న ఎస్‌ఐ బలరామయ్య

అమడగూరు: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు, విద్యార్థినులు తమ ఆండ్రాయిడ్ ఫోన్లలో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా క్లిష్ట పరిస్థితుల్లో రక్షణ పొందవచ్చని ఎస్‌ఐ బలరామయ్య పేర్కొన్నారు. గురువారం చినగానిపల్లిలో మహిళలకు దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. మహిళలపై ఎలాంటి అఘాయిత్యాలు జరగకూడదనే ప్రభుత్వం దిశ యాప్‌ను రూపొందించిందన్నారు. దిశ యాప్ వినియోగంపై వివరించారు. ఇప్పటికే దిశ యాప్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా చాలా మంది మహిళలు రక్షణ పొందారన్నారు. అలాగే గ్రామాల్లో రాత్రి సమయాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే 100 నంబర్‌కు డయల్ చేయాలన్నారు.


విద్యాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు



వంట పాత్రలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ రమణారెడ్డి

నల్లచెరువు: దేవిరెడ్డి పల్లి వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌కు ప్రభుత్వం మంజూరు చేసిన వంట పాత్రలను ఎంపీపీ రమణారెడ్డి, మండల కన్వీనర్ హైదర్‌వలి గురువారం మధ్యాహ్న భోజన ఏజెన్సీ వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యాభివృద్ధికి చర్యలు తీసుకుంటోందన్నారు. అందులో భాగంగానే అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, వంటి అద్భుతమైన పథకాలను సీఎం జగన్ ప్రవేశపెట్టారని తెలిపారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాణాప్రతాప్ నాయక్, ఎంపీటీసి భాస్కర్ రెడ్డి, డైరెక్టర్ ఆదిమూర్తి, పీఈటీ హరి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీలకు ఎంపిక



విద్యార్థి సాయిచంద్రతో ఉపాధ్యాయులు

పుట్టపర్తి టౌన్: అండర్-14 రాష్ట్ర స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలకు ఎనుములపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థి సాయిచంద్ర ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, పీడీ రమేష్ బాబు గురువారం తెలిపారు. ఇటీవల అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో జరిగిన బాల్‌బాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికయ్యాడన్నారు.

90 శాతం పింఛన్ల పంపిణీ

బత్తలపల్లి: మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో 90 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో 6,415 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా.. 5,659 మందికి నగదు అందజేశారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి



నాయకులు, అధికారులతో కలసి ఆర్బీకే శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

ఎన్పీకుంట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతే రాజు. రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎన్.పీ.కుంట-1 రైతు భరోసా కేంద్రం భవనాన్ని ప్రారంభించారు. తొలుత నాయకులు, కార్యకర్తలు గజమాలలతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. పార్టీ నాయకులు, అధికారుల సమక్షంలో రైతుభరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే సిద్దారెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం గ్రామస్థాయిలోనే రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి సేవలు అందిస్తోందని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రైతు సంక్షేమానికి కృషి చేశారని కొనియాడారు. గత టీడీపీ ప్రభుత్వం వ్యవసాయం దండగ అని రైతులను అప్పులపాలు చేసిందని మండిపడ్డారు. ఎంతో మంది రైతులు సాగుకు భారమై ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తు చేశారు. ఆ పరిస్థితి ఇప్పుడు లేదని పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు సాగులో మెలకువలు ఇస్తున్నట్లు తెలిపారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను సరసమైన ధరలకే ఆర్‌బీకేల ద్వారా అందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల సేవలు క్షేత్రస్థాయిలో రైతులకు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మండల వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు రైతులతో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. పంటల సాగులో తగిన సూచనలు, సలహాలు అందించాలని సూచించారు. రైతులు అధిక దిగుబడులు సాధించేలా ప్రోత్సహించాలని తెలిపారు. ఆర్బీకేలో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రం వినియోగంపై అడిగి తెలుసుకున్నారు. మండల వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో ఏయే పంటలు సాగు చేశారు? ఏ మేరకు ఈ-క్రాప్ నమోదు చేశారని మండల వ్యవసాయ శాఖ అధికారిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఆర్బీకేలో రైతులకు అవసరమయ్యే ఎరువులను అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా త్వరితగతిన ఆర్‌బీకే నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేసిన నిర్మాణ సహాయకుడు వాసుదేవరెడ్డిని సన్మానించారు. అలాగే మండల అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆదినారాయణరెడ్డిని వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈటె రాము, మండల కన్వీనర్, ఎంపీటీసీ సభ్యుడు కొత్తరంగారెడ్డి, స్థానిక సర్పంచ్ అంజినమ్మ, కో-ఆప్షన్ సభ్యుడు సుబహాన్, తహసీల్దార్ నరేంద్రకుమార్, మండల వ్యవసాయశాఖ అధికారి లోకేశ్వరరెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్ బయారెడ్డి, నాయకులు తిరుమలనాయుడు, గోవిందు నాయక్, ఈశ్వర్‌నాయక్, కిష్టా, అనిల్ నాయుడు, అల్లాబక్షు, మాజీ ఎంపీపీ సోమిరెడ్డి, నారాయణ స్వామి, ఈశ్వర్‌రెడ్డి, నరసింహారెడ్డి, గంగరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు రమేష్, ముబారక్, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సభ

నల్లమాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం 10 గంటలకు సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహించనున్నట్లు ఏపీఓ సూర్యనారాయణ తెలిపారు. మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధిహామీ పనులపై ఇప్పటికే తనిఖీ బృందం విచారణ పూర్తి చేసిందన్నారు.

లైసెన్స్ లేకుంటే జరిమానా తప్పదు



వాహనాలను తనిఖీ చేస్తున్న టూటౌన్ సీఐ అశోక్ కుమార్

ధర్మవరం అర్బన్: వాహనాలకు లైసెన్సు లేకుంటే జరిమానా తప్పదని టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ హెచ్చరించారు. పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. ద్విచక్ర వాహనాలను ఆపి లైసెన్సులు, డ్రైవింగ్ లైసెన్సులను పరిశీలించారు. లైసెన్సు లేని వాహనాలకు జరిమానా విధించారు. లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. లేకపోతే జరిమానా విధిస్తామని తెలిపారు.

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

తలుపుల: మండల పరిధిలోని మాడికవాండ్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వి.గంగిరెడ్డి (86) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే డా.పి.వి సిద్దారెడ్డి గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. గంగిరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మృతుడి కుమారులు ఓబులరెడ్డి, మధుసూధన్‌రెడ్డిని ఓదార్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఫయాజ్ అహమ్మద్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ లింగాల మధుసూదన్‌రెడ్డి, ఆవుల వెంకటనారాయణ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

శుభకార్యం

పుట్టపర్తి టౌన్: బీడుపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రామచంద్రారెడ్డి కుమార్తె భార్గవిరెడ్డి వివాహం బుక్కపట్నం మండలం జానకాంపల్లికి చెందిన శ్రీనివాసరెడ్డి కుమారుడు గౌతమ్‌రెడ్డితో జరిగింది. జగరాజుపల్లి క్రాస్ వద్ద ఉన్న మహి శ్రీనివాస గార్డెన్స్‌లో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తండ్రి, మాజీ రెస్కో ఎండీ దుద్దుకుంట వెంకటరామిరెడ్డి పాల్గొని వధూవరులు ఆశ్వీరదించారు. కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, మాజీ నెడ్‌క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, మండల అగ్రీ అడ్వైజరీ బోర్డు చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, నాగిరెడ్డి, కేవవనాయుడు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల పరిశీలన

అమడగూరు: మండలంలోని కొలిమిర్లాళ్లపల్లిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద సాగు చేస్తున్న ఉద్యాన పంటలను ఎంపీడీఓ మునెప్ప గురువారం పరిశీలించారు. మొక్కలను ఎప్పుడు నాటారు? ఇంతవరకూ ఎంత మేరకు బిల్లులు వచ్చాయని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఉద్యాన పంటలను ప్రోత్సహించాలన్నారు. ఎప్పటికప్పుడు బిల్లులు అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకూ 75 ఎకరాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద మొక్కల పెంపకం చేపట్టినట్లు తెలిపారు. ఏపీఓ అమరావతి పాల్గొన్నారు.

వాటర్ బాడీ గణన పూర్తి చేయండి



వీఆర్‌ఓలతో సమావేశమైన డీవైఎస్‌ఓ గోపాల్

బత్తలపల్లి: పది రోజుల్లో మీ పరిధిలోని గ్రామాల్లో వాటర్ బాడీ గణన పూర్తి చేయాలని ధర్మవరం డివిజన్ డీవైఎస్‌ఓ గోపాల్ వీఆర్‌ఓలకు సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏఎస్‌ఓ డాక్టర్ లక్ష్మీనరసింహాశర్మతో కలసి వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లోని వాటర్ బాడీ గణన 2022-23కు సంబంధించిన చెరువులు, ఊట చెరువులు, చెక్‌డ్యాంల గణన చేయాలని పేర్కొన్నారు. అనంతరం ఏఎస్‌ఓ గణన చేయు విధానంపై విపులంగా వివరించారు. ప్రతి ఒక్క వాటర్ బాడీని జియో ట్యాగింగ్ చేయాలని ఆదేశించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

తనకల్లు: గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులు ప్రభుత్వ లక్ష్యంలో భాగస్వాములు కావాలని మండల స్పెషలాఫీసర్, డీఎల్‌డీఓ సూర్యనారాయణ అన్నారు. మండల పరిధిలోని తవళం, గేమేనాయక్‌తండా గ్రామ సచివాలయాలను గురువారం ఎంపీడీఓ పూల నరసింహులుతో కలిసి తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. సంక్షేమ పథకాలకు అర్హుల జాబితాలను కార్యాలయంలో ప్రదర్శించాలన్నారు. ఆయుష్మాన్ భారత్ సర్వేను పూర్తి చేయాలన్నారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఆనందయ్య., కార్యదర్శి ఆంజనేయులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'తో నిరుపేదలకు ఊరట



ధర్మవరంలో వృద్ధుడికి కళ్లదాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి

ధర్మవరం: జగనన్న ఆరోగ్య సురక్షతో నిరుపేదలకు మేలు జరుగుతోందని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి తెలిపారు. పట్టణంలోని తిక్కస్వామి నగర్, లక్ష్మీచెన్నకేశవపురం, సాయినగర్‌లో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. కంటి చూపు తగ్గిన వృద్ధులకు వైద్య పరీక్షలు చేసి, కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ రాయపాటి రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

కదిరి టౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిరుపేదలకు ఒక వరమని మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు తెలిపారు. పట్టణంలోని మశనంపేట మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. స్థానికులకు వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు మందులు అందజేశారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరికి గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సిద్దిక్

తనకల్లు: మండల పరిధిలోని కొక్కంటి క్రాస్‌లో గురువారం బైక్ అదుపుతప్పిన ఘటనలో ఓ యువకుడు గాయపడ్డాడు. తిరుమలయ్యగారి పల్లికి చెందిన రేవంత్‌రెడ్డి వ్యక్తిగత పని మీద ద్విచక్ర వాహనంలో కొక్కంటి క్రాస్‌కు వచ్చాడు. అనంతరం స్వగ్రామానికి వెళ్తుండగా.. బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న బోర్డును ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో రేవంత్‌రెడ్డికి స్వల్పంగా గాయాలయ్యాయి.

తీవ్రంగా గాయపడిన ఇంటర్ విద్యార్థి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని రైల్వే బ్రిడ్జిపై ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ఘటనలో ఇంటర్ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని అస్సార్ వీధికి చెందిన మున్వర్ కుమారుడు మహమ్మద్ సిద్దిక్ ద్విచక్ర వాహనంలో గురువారం సాయంత్రం దుర్గానగర్‌లోని బంధువుల ఇంటికి బయలుదేరాడు. దుర్గానగర్‌లోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై వెళ్తుండగా.. ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సిద్దిక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడ్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. సిద్దిక్ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కూలీలందరికీ ఉపాధి పనులు



కూలీలతో మాట్లాడుతున్న అధికారులు

ధర్మవరం రూరల్: గ్రామాల్లో అడిగిన ప్రతి కూలీకి ఉపాధిహామీ పథకం ద్వారా పనులు కల్పించడం జరుగుతుందని ఎంపీడీఓ సౌజన్య కుమారి అన్నారు. గురువారం మండల పరిధిలోని రేగాటిపల్లిలో పంచాయతీరాజ్ డీఈ లోకన్న, ఏఈ రమణ, ఏపీఓ అనిల్ కుమార్‌రెడ్డి, సచివాలయ సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా ఉపాధి పనులు కల్పించడం జరుగుతోందన్నారు. కూలీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వంద పని దినాలు పూర్తి చేసుకున్న కూలీలు కూడా పనులకు వెళ్లొచ్చని తెలిపారు. కాలువల్లో పూడికతీత, చెక్ డ్యాంలలో పూడిక తీయడం, పశువులకు తాగునీటి కోసం చెరువులలో కాటిల్ పాండ్‌ల తవ్వకాలు తదితర పనులు కల్పించడం జరుగుతోందన్నారు. పంచాయతీ కార్యదర్శి సువర్ణ పాల్గొన్నారు.

నల్లచెరువు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉపాధి సిబ్బందితో ఎంపీడీఓ శకుంతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న వర్షాభావ పరిస్థితుల వల్ల ఉపాధి కూలీలందరికీ పనులు కల్పిస్తామన్నారు. ఉపాధి పనుల కోసం సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ మంజుల, కార్యదర్శి రమణప్ప నాయుడు, గంగాధర, హిమకర్ పాల్గొన్నారు.

పింఛన్ కోసం వచ్చి మహిళ మృతి



మృతి చెందిన నాగలక్ష్మమ్మ

బత్తలపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ గురువారం మండల కేంద్రంలో మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని గంటాపురం గ్రామానికి చెందిన బోయ నాగలక్ష్మమ్మ (45) మూడు నెలలుగా ధర్మవరంలో ఉంటోంది. ప్రతి నెలా పింఛన్ కోసం స్వగ్రామానికి వచ్చేంది. అందులో భాగంగా బుధవారం వచ్చి పింఛన్ తీసుకుని తెల్లవారుజామున ధర్మవరం వెళ్లేందుకు బయలుదేరింది. గంటాపురం వెళ్లే రహదారి ప్రక్కన సమాధిపై నిద్రించి అక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త గతంలోనే మృతి చెందాడు. ఈమెకు సంతానం కూడా లేదు. బత్తలపల్లి ఎస్‌ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. అనారోగ్యంతో మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

రస్తా సమస్య పరిష్కారం



జేసీబీతో రహదారి పనులు చేయిస్తున్న పోలీసులు

గాండ్లపెంట: మండల పరిధిలోని మద్దివారిగొంది పంచాయతీ కమతంపల్లి గ్రామంలో నెలకొన్న పొలం రస్తా సమస్యను ఎస్‌ఐ వెంకటనారాయణ పరిష్కరించారు. గురువారం ఇరువర్గాలను ఒప్పించి రైతులు పొలాలకు వెళ్లేందుకు పక్కా రస్తాను ఏర్పాటు చేయించారు. వివరాలు.. కమతంపల్లిలోని బండ్లపర్లు సమీపంలోని పొలాలకు వెళ్లేందుకు రస్తా సమస్య ఉండేది. సమస్యను పరిష్కరించాలని ఇరువర్గాల రైతులు ఇటీవల ఎస్‌ఐకు ఫిర్యాదు చేశారు. రస్తా సమస్యను ఇరువర్గాలు కలసి సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఎస్‌ఐ రైతులకు సూచించారు. అయినా సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. గురువారం ఇరువర్గాల రైతులతో ఎస్‌ఐ వెంకటనారాయణ మాట్లాడారు. ఇరువర్గాలకు ఆమోదయోగ్యంగా ఉండేలా సొంత ఖర్చులతో జేసీబీ ఏర్పాటు చేసి రస్తా వేయించారు.

భూ పంపిణీ వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

చెన్నేకొత్తపల్లి: భూ పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ లబ్ధి చేకూర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం భూ పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. మూడు మండలాల్లో జరుగుతున్న గృహ నిర్మాణాలను వేగవంతంగాపూర్తి చేయాలని లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో అందించేలా అధికారులు చొరవచూపాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు షాబుద్దీన్, నారాయణ స్వామి, హౌసింగ్ డీఈ శంకర్‌లాల్ నాయక్, ఎంపీడీఓ గంగావతి, జెడ్పీటీసీలు గోవిందరెడ్డి, మారుతీ, నాగార్జున, ఎంపీపీ అంజలి పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాను సరిచూసుకోండి



మాట్లాడుతున్న ఆర్డీఓ రమేష్‌రెడ్డి

ధర్మవరం అర్బన్: ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాను పరిశీలించుకుని తమ పేర్లు ఉన్నాయో లేదో చూసుకోవాలని ఆర్డీఓ రమేష్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమావేశ భవనంలో గురువారం పట్టణ, రూరల్ బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లతో ఓటరు జాబితాపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. బీఎల్‌ఓలు ఓటరు జాబితాను పరిశీలించాలన్నారు. అందులో డబుల్, డెత్, సిఫ్టెడ్ తదితర వాటిపై పక్కాగా విచారించి ఫారం-7 దరఖాస్తు చేయాలని సూచించారు. కొత్తగా నమోదైన వాటికి ఆధారాలు ఇప్పించుకుని నివాసం ఉన్నారో లేదో విచారణ చేసిన అనంతరం బీఎల్‌ఓ యాప్‌లో ఫార్వర్డ్ చేయాలని సూచించారు. జీరో డోర్‌నెంబర్లు ఉన్నా, జెండరు తప్పుగా ఉన్నా, పేరు తప్పుగా ఉన్నా, ఒకే డోర్ నంబర్‌లో 10 మంది కన్నా ఎక్కువ ఉన్నా తదితర వాటిని విచారణ చేసి వాటిని ఫారం-8లో నమోదు చేయాలని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ యుగేశ్వరి దేవి, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రఫీనాయక్

తలుపుల: వివిధ సమస్యలపై మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలను అధికారులు ఆప్యాయంగా పలకరించాలి. సమస్యలను తెలుసుకుని, వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రఫీనాయక్ అధికారులకు సూచించారు. స్థానిక వైకేపీ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ కే.శ్రీధర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ .. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేర్చాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మండలంలో విద్యుత్ సమస్యలు అక్కడక్కడ ఉన్నట్లు తెలిపారు. వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మహేశ్వర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ టోపీ రమణ, ఏఓ షాదబ్, సర్పంచ్ శ్రీలత, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని సుబ్బరావుపేటకు చెందిన అలివేలమ్మ గురువారం కడుపునొప్పి తాళలేక సూపర్‌వాస్మోల్ తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు.

కార్గో సేవల్లో కదిరి డిపో ముందంజ

కదిరి అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీల్లో కదిరి డిపో ముందంజలో ఉందని డీఎం మైనుద్దీన్ గురువారం తెలిపారు. డిపోలోని ఉద్యోగులందరూ సమష్టిగా పని చేస్తూ జిల్లాలోనే కదిరి డిపోను ఆదర్శంగా నిలుపుతున్నారని పేర్కొన్నారు. అనంతరం అసిస్టెంట్ మేనేజర్ హరిమోహన్ 20, ఎన్‌ఎంయూ డిపో కార్యదర్శి బైరిశెట్టి 15 డోర్ డెలివరీలను బుక్‌చేసి డీఎంకు అందజేశారు. డిపోలోని 471 మంది ఉద్యోగులు ప్రతి ఒక్కరూ కనీసం 3 డెలివరీలను బుక్ చేయించాలన్నారు. కార్యక్రమంలో కార్గో సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ట్రాఫిక్ సూపర్‌వైజర్ నాగసుబ్బయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

నల్లచెరువు: బాలేపల్లి తండాకు చెందిన బి.గుండప్ప నాయక్ (45) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా తక్షణసాయం కింద రూ.10 వేల తక్షణసాయాన్ని గురువారం మృతుడి భార్య బి.ముత్యాలమ్మకు అధికారులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రమణానాయక్, బాలకృష్ణ నాయక్, వెల్ఫేర్ అసిస్టెంట్ జయమ్మ పాల్గొన్నారు.

నేడు కదిరికి ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర

కదిరి టౌన్: లౌకికవాదం ప్రజాస్వామ్య పరిరక్షణ అసమానతలు లేని అభివృద్ధి కోసం సీపీఎం చేపట్టిన బస్సు యాత్ర శుక్రవారం కదిరికి రానుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సుబ్బిరెడ్డి, పట్టణ కార్యదర్శి జీఎల్ నరసింహులు తెలిపారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద 11 గంటలకు సభ నిర్వహిస్తామన్నారు. ఈ యాత్రలో కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, రాంభూపాల్, రాష్ట్ర కమిటీ సభ్యులు కృష్ణయ్య, ఉమామహేశ్వరరావు, శివ నాగరాణి, రమాదేవి పాల్గొంటారన్నారు.

ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో వైద్య నారాయణ ధన్వంత్రి స్వామి ఆలయం నిర్మాణానికి గురువారం పూజలు చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మేడాపురం వెంకటేష్, నాయీ బ్రాహ్మణులు మల్లన్న, ఆలయ అధ్యక్షుడు రామచంద్ర, కార్యదర్శి ఆంజనేయులు, లింగమయ్య, తిరుపతయ్య, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

తనకల్లును కరువు మండలంగా ప్రకటించాలి

తనకల్లు: తనకల్లును కరువుగా మండలంగా ప్రకటించాలని సీపీఎం, రైతు సంఘం నాయకులు గురువారం తహసీల్దార్ శోభ సువర్ణమ్మకు వినతిపత్రం అందజేశారు. తీవ్ర వర్షాభావం కారణంగా పంటలను సాగు చేసిన రైతులు నష్టపోయారన్నారు. ప్రభుత్వం వెంటనే కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరారు. నాయకులు శివన్న, రమణ, పారేసు, చంద్ర పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ట

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేపీటీ వీధిలో ఉన్న పంచనాథేశ్వర స్వామి ఆలయంలో గురువారం విగ్రహాల పునః ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. నాలుగు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విగ్రహాలను పునః ప్రతిష్టించారు. శేష హోమాలు, పంచామృతాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. పూజల్లో ఆలయ కమిటీ సభ్యుడు కొత్తపాలెం హరిప్రసాద్, కార్యదర్శి రామశేషయ్య పాల్గొన్నారు.